క్లుప్తంగా

లైన్‌మెన్ల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నంద్యాల(అర్బన్): నిరంతరం వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న విద్యుత్ లైన్‌మెన్ల సేవలు అభినందనీయమని విద్యుత్ శాఖ నంద్యాల డివిజన్ ఈఈ శ్రీనివాసులురెడ్డి అన్నారు. జాతీయ లైన్‌మెన్ దివస్‌ను పురస్కరించుకొని మంగళవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి లైన్‌మెన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారులకు విద్యుత్ సమస్యలు లేకుండా శ్రమిస్తున్నారని కొనియాడారు. రూరల్ సెక్షన్ ఏఈఈ శ్రీనివాసులు, నంద్యాల పట్టణ డీఈఈ రమేష్, నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ ప్రమీల

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ ప్రమీల సూచించారు. మంగళవారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మార్చి1 వరకు ఉన్న గడువును ప్రస్తుతం ఈనెల 6 వరకు పొడిగించినట్లు చెప్పారు. అలాగే ఈ-క్రాప్ అనంతరం ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ-క్రాప్ నమోదై ఉండాలన్నారు. వీఏఏలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



రుద్రవరంలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలస్వామి

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం ఎస్సీ కాలనీలో మంగళవారం కొత్తగా మురుగు కాల్వ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచు బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని రామయ్య దుకాణం వద్ద నుంచి పోలీస్ స్టేషన్ వైపు చిటికెల లూకయ్య ఇంటి వరకు కాల్వ నిర్మాణ పనులను ఎంపీపీ బాలస్వామి భూమిపూజ చేసి ప్రారంభించారు. మేజర్ పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సుబ్బారావు మాట్లాడుతూ.. కాలనీలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చేసేందుకు దాదాపు రూ.15లక్షలతో వెయ్యి మీటర్ల పొడవునా మురుగు కాల్వల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమం జరిపించారు. ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు

నంద్యాల(అర్బన్): అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు అందనున్నాయని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ దాసులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నంద్యాల క్లస్టర్‌కు సంబంధించి ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల కోసం ఎస్‌హెచ్‌జీ మహిళా రుణాలు, వ్యక్తిగత ఉమెన్ లీడ్ ఎంటర్ ప్రైజెస్ గ్రౌండింగ్‌కు సహకరించాలన్నారు. అధికారులు చంద్రశేఖర్, వివిధ మండలాల ఎంపీడీఓలు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

అసలుకు భరోసా...
భవిత కులాసా!

- బాలికలు, మహిళల కోసం పోస్టల్ పథకాలు
- నెలాఖరు వరకు అవకాశం

నంద్యాల(న్యూటౌన్): బాలికల, మహిళల ఆర్థిక పురోభివద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. పొదుపు చేసిన సొమ్ముకు భద్రతతో పాటు ఈ రెండు పథకాలు బాలికలకు, మహిళలకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. నెలాఖరు వరకు మాత్రమే అమలులో ఉండే పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, డ్రైవ్‌లు నిర్వహించేందుకు తపాలాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పథకంలో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ అవకాశం ఉంది.

వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్‌టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా కొనసాగుతుంది. గరిష్ట మొత్తానికి రూ.2లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశం కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండు సంవత్సరాలు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉంది. వడ్డీ రేటు ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.



మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం లోగో

స్కీంలో చేరే విధానం..

- మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరే లబ్ధిదారులు ఆధార్, పాన్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించాల్సి ఉంటుంది.
- ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే అవకాశం ఉంది.
- ఒక వేళ డిపాజిట్ దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసివేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి మొత్తాన్ని చెల్లిస్తారు.
- అవసరాన్ని బట్టి రెండు శాతం వడ్డీ తగ్గించుకొని (5.5 శాతం వడ్డీతో) ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు. నంద్యాల డివిజన్ పరిధిలోని సుకన్య సమృద్ధి పథకం 39,943 మహిళా సమ్మాన్ సేవింగ్స్ 4,608 ఖాతాలు ఉన్నాయి.

సుకన్య సమృద్ధి యోజన..

ఈ పథకంలో చేరేందుకు పదేళ్ల లోపు బాలికలు అర్హులు. కనీసం రూ.250 డిపాజిట్‌తో ఆడపిల్ల పుట్టినప్పుడు ఖాతా తెరిచి, ప్రతి నెలకు కనీసం వంద రూపాయలు నుంచి పొదుపు చేస్తే తల్లిదండ్రుల మొత్తం పెట్టుబడి రూ.18 వేలు (15 సంవత్సరాలకు) పెడితే వారికి మెచ్యూరిటీగా (21 సంవత్సరాల తర్వాత) రూ.53,945 తపాలా శాఖ అందిస్తుంది.



మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో సొమ్ము పెరిగేది ఇలా..

డిపాజిట్	2ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం
రూ.1000	1154
రూ.10వేలు	11,604
రూ.50వేలు	58,012
రూ.లక్ష	1,16,21
రూ.2లక్షలు	2,32,44

అవగాహన కల్పిస్తున్నాం



నంద్యాల డివిజన్ తపాలా శాఖ పరిధిలో ఇప్పటి వరకు 4,608 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. 39,943 మంది సుకన్య సమృద్ధి యోజనలో చేరారు. ఈ రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– జనార్దన్‌రెడ్డి, తపాలా శాఖ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, నంద్యాల

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో చదివేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ,ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించి ఏదైనా నెట్ సెంటర్లో లేదా స్మార్టు ఫోన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తును మోడల్ పాఠశాలలో అందించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్20వతేదీన ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

జన ఔషధిని సద్వినియోగం చేసుకోవాలి

దొర్నిపాడు: జన ఔషధి మందులు చాలా తక్కువ ధరకు లభిస్తున్నాయని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈఓ సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ ఆవరణలో జన ఔషధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సహకార సంఘంలోని జన ఔషధి కేంద్రంలో అన్ని రకాల మందులు తక్కువ ధరకే లభిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు జ్యోతి, అమరేశ్వరరెడ్డి, కిరణ్ వైద్యచికిత్సలు అందించి జనరిక్ మందుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

పంట మార్పిడితో భూసారం పెంపు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ

శిరివెళ్ల: పంట మార్పిడితో భూసారం, దిగుబడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం చెన్నూరు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రతి ఏటా వేసిన పంటనే మరుసటి సంవత్సరం వేస్తున్నారన్నారు. దీనివలన భూసారం తగ్గి దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. రైతులు అధిక దిగుబడుల కోసం అధిక మోతాదులో రసాయిక ఎరువుల వాడుతున్నారన్నారు. దీంతో పండించిన పంటలు విషతుల్యమవుతున్నాయన్నారు. అలాగే అంతర్ పంటల సాగుతో కూడా ఎంతో లాభాలున్నాయని చెప్పారు. మొక్క జొన్న పంటలో కొర్ర, మినుము పంటలను కూడా సాగు చేయవచ్చని తెలిపారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు తప్పని సరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాంమోహన్‌రెడ్డి, ఏఓ సుధాకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏఈ నాగరాజు

శిరివెళ్ల: వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక విద్యుద్ సబ్‌స్టేషన్‌లో మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల సబ్ స్టేషన్ల లైన్ మెన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల పాటు పొలాలలో ఏ పంటలు ఉండవని, అందువలన విద్యుత్ స్తంభాల స్థితి గతులను పరిశీలించాలన్నారు. దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో విద్యుత్ వాడకం అధికంగా ఉంటుందని, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లలకు కూడా ప్రతి పాదనలు ఇవ్వాలన్నారు. అధిక లోడ్ వినియోగ దారులకు జూన్ 30 వరకు విద్యుత్ బిల్లులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. విషయంను ప్రజలకు తెలియ చేయాలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు మైఖేల్, నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



ఇంజేడులో పశువులకు టీకాలు వేస్తున్న సంచాలకులు వరప్రసాద్

ఉయ్యాలవాడ : పశు పెంపకందారులు ప్రభుత్వం చేపట్టిన జాతీయ పశు వ్యాధి నియంత్రణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సంచాలకులు వరప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ, హరివరం గ్రామాలలో పశు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి 8 నెలల వరకు వయస్సు వున్న ఆడ దూడలకు టీకాలు వేయడం జరుగుతోందన్నారు. అలాగే ఎద్దులు, ఆవులకు కూడా టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు. చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో 20 వేల పశువులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 3 వేల పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, మహాలక్ష్మి, నాగశైలజ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల కుమ్మక్కు!

- మహానందీశుడి ఆదాయానికి గండి కొట్టే యత్నం
- రెండోసారి టోల్‌గేట్ల టెండర్లు వాయిదా



తక్కువగా వచ్చిన టెండర్‌దారులు

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానంలో టోల్‌గేట్ల నిర్వహణకు నిర్వహించే బహిరంగ, సీల్డు టెండర్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. గత ప్రభుత్వంలో నిర్వహణ హక్కును పొందేందుకు పలువురు పోటీపడ్డారు. దీంతో మహానందీశ్వరస్వామికి భారీగా ఆదాయం సమకూరింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడా, చోటా నేతలంతా మహానంది దేవస్థానంలో జరిగే టెండర్లపై కన్నేశారు. ఇప్పటికే పలువురు వివిధ విభాగాల టెండర్లలో పాల్గొని హక్కులను దక్కించుకున్నారు. అందరూ సిండికేట్ అవుతూ డిపాజిట్లను కట్టేందుకు వచ్చిన వారిని సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా మంగళవారం టోల్‌గేట్ల నిర్వహణ టెండర్లను రెండో సారి వాయిదా వేయించడంతో ఓ కూటమి నేత కీలక పాత్ర పోషించినట్లు జోరుగా చర్చలు జరిగాయి.

ఆదాయానికి గండికొట్టే యత్నం

మహానంది దేవస్థానంలో నంద్యాల నుంచి మహానంది, మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో టోల్‌గేట్లను నిర్వహిస్తారు. వీటి నిర్వహణ బాధ్యతలను గతంలో దేవస్థానం ఆధ్వర్యంలోనే నిర్వహించేవారు. కానీ దేవస్థానానికి ఆదాయం పేరుతో గత కొన్నేళ్లుగా టెండర్లు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ మేరకు గత రెండేళ్లుగా వీటి ద్వారా ఆలయానికి కోట్లలో ఆదాయ వస్తుంది. రెండేళ్ల క్రితం రూ. 1.51కోట్లు రాగా తాజాగా గత ఏడాది 1,71,22,535 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరింత ఆదాయం వస్తుందని ఆశించిన అధికారులకు నిరాశే మిగిలింది. కూటమి నేతలు కుమ్మక్కై ఆదాయానికి గండికొట్టే దిశగా రెండోసారి వాయిదా పడేలా చేశారు. మంగళవారం జరిగిన టెండర్లలో నలుగురు సీల్డు టెండరు దాఖలు చేయగా ఓ కూటమి నేత గత ఏడాది కంటే తక్కువగా కేవలం రూ. 1.34కోట్లకు మాత్రమే సీల్డు టెండరు దాఖాలు చేయడంతో వాయిదా పడింది. దేవదాయశాఖ నిబంధనల మేరకు పాత టెండరు హెచ్చు మొత్తానికి 33శాతం అదనంగా ఉంటేనే హక్కు బాధ్యతలను అప్పగించాల్సి ఉంది. కానీ రెండు, మూడు సార్లు వాయిదా పడితే పోటీ ఎవరూ లేరని అనుకోవడంతో పాటు స్థానిక అధికారి ద్వారా కమిషనర్‌కు లేఖ రాయించి తగ్గింపు మొత్తానికి తీసుకోచ్చన్న పెద్దప్లాన్ పన్నినట్లు ఆలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికే ఈ విషయంపై రాష్ట్ర దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. మరి దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కోలుకోలేక మహిళ మృతి

శిరివెళ్ల: మండల పరిధిలోని వనికినిదిన్నెకు చెందిన జిలకర్ర మాధవి (37) నంద్యాలలో చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. మహిళ భర్త చిన్న మౌలాలి మద్యానికి బానిసై సంసారాన్ని పట్టించుకోవడంలేదు. మందలించినా మార్పు రాక పోవడంతో ఈ నెల 3వ తేదీన ఇంటిలో చీర కొంగుతో ఉరేసుకుంది. గమనించిన బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మృతిచెందింది. మృతురాలి తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక లారీ పట్టివేత

దొర్నిపాడు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ హనుమంతురెడ్డి తెలిపారు. జమ్మలమడుగు నుంచి దొర్నిపాడు వైపు వస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. డ్రైవర్ ప్రదీప్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): గుడ్‌ఫ్రైడే ప్రారంభమయ్యే ఉపవాస రోజుల ప్రత్యేక ప్రార్థనల్లో భాగంగా బుధవారం నుంచి అన్ని ఆలయాల్లో క్రైస్తవులు ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆనవాయితీ ప్రకారం గుడ్‌ఫ్రైడే పండుగకు ముందు రోజులు 41 రోజులు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలతో పాటు తెల్లవారుజామునే ఆయా ఆలయాల్లో గురువులు సందేశం ఇస్తారు. పట్టణంలోని నంద్యాల డయాసిస్ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల్లో బుధవారం ఉదయం 7 గంటలకు భస్మ బుధవారం ప్రార్థనలు ప్రారంభించి నుదుటన శిలువ గుర్తుతో పాటు గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

హమాలీలుగా నమోదు చేసుకోండి

నంద్యాల: స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు 36 మంది హమాలీలు అవసరమని నంద్యాల డిపో మేనేజర్ నాగేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నంద్యాల ఐఎంఎఫ్ఎల్ డిపోలో సంప్రదించాలన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ అమానుల్లా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సచివాలయాల వద్దకు సమస్యతో వచ్చే ప్రజలకు పరిష్కారం చూపాలని చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

- ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఉపాధి అవకాశాలు కల్పించే నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానం కింద ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగ అభివృద్ధికి ముందుకొచ్చే నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నూతన పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్నారు. మూడు నెలల కాలంలో నూతన పరిశ్రమలకు 13 దరఖాస్తులు రాగా సింగిల్ డెస్క్ విధానంలో 8 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, పరిశీలనలో ఉన్న 5 పరిశ్రమల అనుమతులకు సంబంధించి నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ, ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖాధికారులను ఆదేశించారు. ఉత్పాదన, సేవా రంగాల్లోని 18 యూనిట్లకు రూ.0.72 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలిపింది. పెండింగ్‌లో ఉన్న 22వేల యూనిట్ల ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రభుత్వానికి సిఫారసు చేయాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్ బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేయాలి

నంద్యాల(అర్బన్): నంద్యాల చిన్న చెరువు కట్ట తరహాలో పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని నంద్యాల మినీ ట్యాంకు బంక్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీరయ్య, సెక్రటరీ శంకర్‌నాయక్ కోరారు. వాకర్స్ అసోసియేషన్ స్వచ్ఛందంగా మొక్కలు నాటడం, బెంచీలు, జిమ్ పరికరాలు ఏర్పాటు చేసుకున్నారని, చిన్నచెరువు కట్ట తరహాలో పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేయాలంటూ మంగళవారం సాయంత్రం అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కట్టపై మెడిసినల్ ప్లాంట్, సీసీ కెమెరాలు, సిమెంట్ కాంట్రాక్ట్ మరమ్మతులు, సోలార్‌లైట్ల ఏర్పాటు, గ్రావెల్ మొరుసు, కట్టపై గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు కేశవవర్ధన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి

నంద్యాల(అర్బన్): రైతులు పండించే ఉత్పత్తులను నేరుగా మార్కెటింగ్ చేసి రైతును స్వతంత్రుడిగా నిలపడమే భారతీయ కిసాన్ సంఘ్ లక్ష్యమని కిసాన్ సంఘ్ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్ధారెడ్డి, కార్యదర్శి కిసాన్ మహేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చి విష రసాయన రహిత నాణ్యమైన ఆహారాన్ని దేశ ప్రజలకు అందించడం కోసం భారతీయ కిసాన్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. సభ్యులు ఈశ్వరరెడ్డి, కేశవరెడ్డి, రామచంద్రారెడ్డి, పుల్లయ్య, బాలస్వామి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి



గగ్గటూరులో రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

పాణ్యం: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. ఆయన మంగళవారం గగ్గటూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమక్షంలోనే వారి భూములకు కొలతలు వేయాలన్నారు. విస్తీర్ణంలో తేడాలుంటే తక్షణమే వాటిపై దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. గ్రామంలో మొత్తం 542 భూ ఖాతాలు ఉన్నాయని, మొత్తం 1277.87 ఎకరాల భూమి ఉందన్నారు. సగానికిపైగా రీసర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, డీటీ శివశంకర్‌రెడ్డి, సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.





ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా మారిన వాటర్ ప్లాంటు, ఇంటి నుంచి బాటిళ్లతో తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో కోరమండల్ సంస్థ వారు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులకు మంచి నీటి సమస్య మొదలైంది. విద్యా సంవత్సరం ప్రారంభమయినప్పటి నుంచి పాఠశాలలో వాటర్ ప్లాంటు పని చేయకపోయినా ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం బాధాకరం. మధ్యాహ్న భోజన సమయంలో కూడా విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి బాటిళ్లతో నీటిని తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు. కొందరు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయంలో వున్న వాటర్ కూలర్ వద్దకు వెళ్లి మంచినీరు పట్టుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో తరగతి గదుల్లో పాఠ్యాంశాలు బోధన జరుగుతున్న తరుణంలో మంచినీటి దాహం తీర్చుకోవాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో వాటర్ కూలర్ వద్ద నీటిని పట్టుకుంటున్న విద్యార్థినులు